క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా చొప్పదండి పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, గుర్రం రమేశ్‌గౌడ్, కడారి శంకర్, మావురపు రాములు, దూస కైలాసపతి, గుంటి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యతివ్వాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్ కోరారు. ఆదివారం చిగురుమామిడిలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజిన్ సర్కారేనని, నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోశ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, నాయకులు బుద్దార్థి మహేందర్, పెనుకుల సంపత్, బొల్లి రమేశ్, దొంత కరుణాకర్, ముదిగిరి రాజు, బొల్లి సాయికుమార్, మల్లం సతీష్, బొల్లి అనిల్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన దుడ్డెల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి మిలీనియం ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.51,000 వేలు అందించారు. శ్రీనివాస్ అసోసియేషన్‌లో సభ్యుడు, తలా కొంత జమచేసి నగదు అందించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు సురేశ్, ప్రధానకార్యదర్శి చిప్ప తిరుపతి, ఉపాధ్యక్షుడు పరిపాటి మహిపాల్‌రెడ్డి, కోశాధికారి లంకసిరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి అప్పాల రమేశ్, సభ్యులు పరకాల రమేశ్, దుడ్డెల రాజు, కొరండ్ల సంపత్‌రెడ్డి, బండారి రవికుమార్, కొత్తపల్లి సునీల్ పలువురు పాల్గొన్నారు.

సబ్ మైనర్ కాల్వకు మరమ్మతు



జేసీబీతో పూడిక తీత

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలోని సబ్ మైనర్ ఉపకాల్వకు మాజీ సర్పంచ్ దుడ్డు రేణుక ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వకు అనుసంధానంగా నిర్మించిన ఉపకాల్వ 8 ద్వారా మైలారం గ్రామానికి సబ్ మైనర్ కాల్వకు ద్వారా మైలారం, సాంబయ్యపల్లెలోని పొలాలకు సాగు సరఫరా అవుతోంది. ఈక్రమంలో కాల్వలోని పిచ్చి మొక్కలు, గడ్డి, మట్టితో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన చెందగా సమస్య ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి వెళ్లింది. ఆమ్మెల్యే ఆదేశాల మేరకు మరమ్మతు పనులు చేపట్టినట్టు మాజీ సర్పంచ్ తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పంటల పొలాలకు సాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ సర్పంచ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగుల ప్రచారం

కరీంనగర్: ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు కోసం సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణకుమార్, హన్మండ్ల భాస్కర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు యాద రవి ఆదివారం కరీంనగర్‌లో ఇంటింటా ప్ర చారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తి కొమురయ్య అని, ఉపాధ్యాయ లోకం నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నదని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు కొమురయ్యతోనే సా ధ్యమవుతుందని, ఆయన గెలుపు కోసం ప్రతీ సీపీఎస్ ఉద్యోగి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, శశిధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపే..

- అభయ హస్తం డబ్బుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు
- స్వశక్తి సంఘాల్లోని 5452 మంది నుంచి రూ.19.90 లక్షలు జమ
- ఏడాదికి రూ.365 చెల్లించిన 18 నుంచి 58 ఏళ్లలోపు మహిళలు



పేదరిక నిర్మూలన సంస్థ సమావేశంలో అభయ హస్తం డబ్బులపై చర్చిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల స్వశక్తి సంఘాల మహిళలు అభయ హస్తం డబ్బుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. మండలంలో 17 గ్రామాలున్నాయి, ఈ గ్రామాల్లో 37 గ్రామైక్య సంఘాలున్నాయి, సంఘాల్లో దాదాపు 10,316 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో 18 నుంచి 58 సంవత్సరాల లోపు 5452 మంది రోజుకో రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 చెల్లించారు. 2009–2012వ సంవత్సరం వరకు నాలుగేళ్ల పాటు చెల్లించారు. ఈ రకంగా దాదాపు రూ.19.90 లక్షలు చెల్లించి భవిష్యత్‌లో పెన్షన్‌గా వస్తుందని భావించారు. వీరిలో ఆరవై ఏళ్లు నిండిన 376 మంది మహిళలు నెలకు రూ.500 చొప్పున ఐదేళ్లు పెన్షన్ పొందారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మహిళలకు ఈ సౌకర్యం కల్పించగా ప్రత్యేక రాష్ట్రం వచ్చాక మాజీ సీఎం కేసీఆర్ నెలకు రూ.వెయ్యి రూపాయల పెన్షన్ మంజూరు చేసినా తర్వాత పెన్షన్ స్కీమ్ పూర్తిగా నిలిచిపోయింది. స్కీమ్‌ను పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు 2012–13వ సంవత్సరం నుంచి నిలిపివేశారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా నడిచిన సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు లావాదేవీలు నిలిపివేశారు. దీంతో స్కీం పూర్తిగా అమలుకు నోచుకోలేకపోయింది. 18 ఏళ్ల పైబడిన మహిళలు రూ.2000 బ్యాంకుల్లో జమచేశారు. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినప్పటికీ అభయ హస్తం డబ్బుల గూర్చి గత ప్రభుత్వం పట్టించుకోలేదు, ఈ ప్రభుత్వం మాత్రం చెల్లిస్తామంటూ ప్రకటనలు చేస్తోందని మహిళలు ఆరోపిస్తున్నారు. తాము చెల్లించిన డబ్బుల కోసం పన్నేండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపకారవేతనాలు చెల్లింపు

అభయ హస్తం పథకంలో చేరిన ఏడాదికోసారి మహిళలకు ఉమ్మడి రాష్ట్రంలో లబ్ధిచేకూరింది. కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా 9–12 తరగతి వరకు ఏటా ఉపకారవేతనాలు అందించింది. సంవత్సరానికి రూ.1200 చొప్పున అందించింది. దాదాపు రెండు నుంచి మూడు వేల మంది విద్యార్థులు ఈ స్కీమ్ ద్వారా ఉపకార వేతనాలు అందుకున్నారు. మహిళలు చెల్లించిన అభయ హస్తం డబ్బుల కోసం సీఏలను నిలదీస్తున్నారు. ఇంకెప్పుడు వస్తాయని వారెదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరు మండలస్థాయి నిర్వహించే సమావేశాల్లో ఏపీఎం దృష్టికి విషయం తీసుకెళ్తున్నారు.

త్వరలో ఖాతాల్లో జమ



ఏళ్లుగా అభయ హస్తం డబ్బుల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారు చెల్లించిన దానికంటే రెట్టింపు నగదు చెల్లించే ఆలోచనలో ఉంది. త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకానున్నాయి.

– మట్టెల సంపత్, ఏపీఎం, చిగురుమామిడి

ఆధ్యాత్మికం

కిటకిటలాడిన మత్స్యగిరీంద్రుడి జాతర

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి జాతరకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు దినం కావడంతో కరీంనగర్, హుజూరాబాద్, హన్మకొండ, సిద్దిపేట జిల్లాల నుంచి కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



క్యూలైన్‌లో భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సామూహిక వివాహాలు

ఇల్లందకుంట: అపర భద్రాదిగా పేరొందిన శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో పత్తి అన్నారెడ్డిపుష్పలత జ్ఞాపకార్థం నెలకొల్పిన పత్తి కృష్ణారెడ్డిఅనిత దంపతుల అన్నా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 11 మంది జంటలకు ఆదివారం సామూహిక వివాహాలు చేశారు. నూతన వధూవరులకు పుస్తెమెట్టెలు, నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. కన్నుల పండువగా పెళ్లి వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఊరూరా ఫ్రీజర్ బాక్సులు అందించనున్నామని, ఏటా మాఘమాసంలో వివాహాలు జరిపిస్తామని, ఇతర సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు కొత్తజంటలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పర్శరామారావు, సుంకరి రమేశ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



నూతన జంటలకు పూలమాల అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకాలనీ శ్రీలక్ష్మీగణపతి షిరిడిసాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కిషోరాచార్యులు ఆధ్వర్యంలో కలశపూజ, లక్ష్మీగణపతి హోమంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జమ్మికుంట: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఓటమితో కుంగిపోవద్దు

తిమ్మాపూర్: గెలుపోటములు అన్నిరంగాల్లో ఉంటాయని, ఓటమితో కుంగిపోవద్దని, గెలుపునకు పొంగిపోవద్దని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి రవీందర్‌సింగ్ అన్నారు. ఓటమి నుంచి పాఠం నేర్చుకోవాలన్నారు. మండలంలో మన్నెంపల్లి గ్రామంలో పొన్నం చంద్రయ్య గౌడ్ స్మారకార్థం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి రవీందర్‌సింగ్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం టోర్నీకి సహకరించిన నిర్వాహకులు, గ్రామస్తులు, ఆయా గ్రామాల నుంచి వచ్చిన టీం సభ్యులకు పొన్నం అనిల్ కతజ్ఞతలు తెలిపారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న రవీందర్ సింగ్

కార్యక్రమంలో గోవిందరావు, హరిప్రసాద్, భారత్ కుమార్ శర్మ, అశోక్, కిష్టయ్య, శ్రీనివాస్,జగదీష్, కిరణ్, వెంకటేష్, సంపత్, శ్రావణ్, పార్మంది సంపత్, సదయ్య, వేణుకుమార్, ఆర్గనైజర్లు సంజయ్, రాజు, శ్రీకాంత్, ఆశోద సాగర్, కొలిపాక చింటు, బీనపల్లి అజయ్, అక్కపల్లి అనిల్,శ్యామ్ సుందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రమిస్తున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు జమ్మికుంటలోనే ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఓపెన్ స్కూల్ బోధకులు రావికంటి సురేందర్, కర్ణకర్, అశోక్‌కు ఆదివారం విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. అనేక కారణాలతో చదువు మధ్యలో మానేసి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అనేక వ్యయప్రయాసలతో వివిధ మండలాల నుంచి జమ్మికుంటకు వస్తున్నారు. హు జూరాబాద్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంటలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం

కరీంనగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ అగ్రభాగాన ఉందని, ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వంగ మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీ సమావేశంలో మట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ ఇప్పించి, వందల జీవోలు ఉపాధ్యాయుల ఒడిలో పోసిన సంఘం పీఆర్టీయూ అని, బతకలేక బడిపంతులు నుంచి బతుకు నేర్పిన గురువుగా తీర్చిదిద్దిన చరిత్ర పీఆర్‌టీయూదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20,000 పైగా పదోన్నతులు, 35,000 బదిలీలు, మోడల్ స్కూల్, కేజీబీవీలకు బదిలీలు కల్పించిన సంఘం పీఆర్టీయూ అని గుర్తు చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

హుజూరాబాద్: పట్టణంలోని జామ మసీద్ అధ్యక్షుడు ముజాహిద్ అధ్యక్షతన మసీద్ ఏ బషీర్ మసీద్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా షేక్ ఫయాజ్, గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ యాకుబ్, సెక్రటరీగా అజ్మత్, జాయింట్ సెక్రటరీగా ఫారోక్, ఆర్గనైజషన్ సెక్రెటరీగా యాకుబ్, చీఫ్ అడ్వైజర్‌గా రఫీ, కోశాధికారిగా నేహల్, ఉపాధ్యక్షుడిగా ఆరిఫ్, ఆఫ్సర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సన్మానం

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో బీసీ కులాలకు చెందినవారి సంఖ్యను తప్పుగా చూపించారని.. కులగణన సర్వే మళ్లీ నిర్వహించాలని పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు రాంనగర్ బీసీ సంఘానికి చెందిన యువకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, సాయిచరణ్, శేఖర్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫోర్ వీలర్స్..

ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆదివారం కరీంనగర్ ఆల్ ఫోర్‌వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి ంది. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అధ్యక్షుడు కానుగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శి జాప మునీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాబా, గౌరవ అధ్యక్షుడు వడ్లూరు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను సన్మానిస్తున్న ఫోర్ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ సభ్యులు

డ్రై ఫ్రూట్స్ షాప్ ప్రారంభం

కరీంనగర్: పట్టణంలోని ముకరంపురలో నూతనంగా ఏర్పాటు చేసిన తాహా డ్రై ఫ్రూట్స్ షాపును ఆదివారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, షాపు నిర్వాహకులు మహమ్మద్ అఫ్రోజ్ అలీ, మహమ్మద్ వసీం అక్తర్‌తో కలిసి ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. బీఆర్‌ఎస్ మైనార్టీ శాఖ నగర అధ్యక్షుడు మీర్ షౌకత్‌అలీ, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ అఖిల్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

మండల వనరుల కేంద్రం తరలింపు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ మండల వనరుల కేంద్రాన్ని కొత్తగా గోదాంగడ్డలోని పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్లు ఎంఈవో కె.రవీందర్ తెలిపారు. గతంలో ధన్గర్‌వాడీ పాఠశాల ఆవరణలో ఉన్న ఉమ్మడి విద్యావనరుల కేంద్రం నుంచి కరీంనగర్‌రూరల్ మండల ఎమ్మార్సీని వేరుచేసి ఇక్కడికి తరలించినట్లు వివరించారు. ఉపాధ్యాయులు పోలీస్‌లైన్‌లోని పాఠశాల ఆవరణలోని ఎమ్మార్సీకి రావాలని కోరారు.

మహా రుద్రహోమం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలోని త్రిశక్తి ఆలయంలో నవమ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, సరస్వతి, గణపతి, ఆంజనేయ, నాగదేవత, శివపంచయతన, నవగ్రహాల విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం వేదపండితులు మల్లికార్జునస్వామి, సత్యనారాయణశర్మ, రాజేశంశర్మ ఆధ్వర్యంలో శ్రీదేవి సహిత మహారుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వేముల అంజయ్య, భక్తులు పాల్గొన్నారు.



శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ పల్లె ప్రకృతి వనంలో నీరు పోయకపోవడంతో మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గతంలో మొక్కలు నాటి నీరు పోశారు. కొన్ని రోజులుగా మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండకు ఎండిపోతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శారద, ఏపీవో, శంకరపట్నం, సెల్ నంబర్: 92814 82677

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన మోడల్స్‌తో విద్యార్థులు

హుజూరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కృష్ణసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన మార్షల్ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో గ్లోబల్ షోటోకాన్ కరాటే డూ ఇండియా హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి మోడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ తెలిపారు. కట్టాస్ విభాగంలో విద్యార్థులు మోడల్స్ సాధించగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు ముజాహిద్ హుస్సేన్, ఖాలీద్ హుస్సేన్, యాదగిరి నాయక్, మేకల తిరుపతి, గోస్కుల మధు, తౌఫిక్ అభినందనలు తెలిపారు.



సాధించిన బహుమతులతో విద్యార్థులు

హుజూరాబాద్: ఎస్ఆర్ఎఫ్ ఒలింపియాడ్ పరీక్షల్లో పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ యాదవ్ ఆదివారం తెలిపారు. హనుమకొండ పట్టణంలోని కేయూ యూనివర్సిటీ ఆడిటోరియంలో కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ప్రశాంత్‌రెడ్డి చేతులమీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. డైరెక్టర్ తిరుపతియాదవ్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి ప్రణాళిక ఖరారు

- 2025–26 ఆర్థిక సంవత్సరంలో 1.56లక్షల పనిదినాలు
- వ్యవసాయ పనులకు ప్రాధాన్యత

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు పని కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనిదినాలను అధికారులు ఖరారు చేశారు. గతేడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు కోసం అధికారులు గ్రామసభలను నిర్వహించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వరకు స్థానికంగానే కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

1.56లక్షల పనిదినాలు

కరీంనగర్ మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో 2025–26 ఆర్థికసంవత్సరంలో మొత్తం 1,56,200 పనిదినాలను కల్పించాలని డీఆర్‌డీవో అధికారులు నిర్ణయించారు. మొత్తం 4,538 జాబ్ కార్డులున్నాయి. కార్మిక బడ్జెట్ రూ.4.87 కోట్లు, మెటీరియల్ బడ్జెట్ రూ.1.95 కోట్లు మంజూరయ్యాయి. గతానికి భిన్నంగా గ్రామం యూనిట్‌గా పనులు చేపట్టాలని రెండేళ్లక్రితం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పనుల గుర్తింపు, కూలీల వేతనాలను చెల్లించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఎన్ఐసీని (నేషనల్ ఇన్ఫార్మటిక్ సెంటర్) వినియోగిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఉపాధి పనులకు హాజరైన కూలీలకు ఆధార్‌కార్డు నంబర్‌తో లింక్ ఉన్న బ్యాంకుఖాతాలో వేతనాలను జమ చేస్తున్నారు.



చేగుర్తిలో నీటికందకాలు తవ్వుతున్న కూలీలు (ఫైల్)

చేపట్టనున్న పనులు

కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఈ ఏడాది గ్రామాలకు ఉపయోగపడే పనులను గుర్తించారు. ప్రధానంగా చెరువులు, కుంటలు, పంట కాలువల్లో పూడికతీత, నీటికుంటల నిర్మాణం, ఇంకుడుగుంతలు, వనమహోత్సవానికి గుంతల తవ్వకం, పంటపొలాలకు కొత్త దారుల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు. ప్రతీ గ్రామంలో వందమందికి తగ్గకుండా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పట్టభద్రుల సమస్యలపై ఉద్యమిస్తా

కరీంనగర్‌రూరల్: పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలం చామనపల్లిలో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించి, హక్కుల కోసం ఉద్యమించేందుకు తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు భూమయ్య, అశోక్, పర్శరామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ